ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాభిప్రాయ సేకరణలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు

మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, మే 26 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కొన్ని రోజులుగా ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గుడ్ మార్నింగ్ మణికొండ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో నాయకులు పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 4- 25 మార్గ మధ్యలో బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో స్థానికులు పాల్గొని పలు సమస్యలను లేవనెత్తారు. ప్రధానంగా మొదట్లో వేసిన చిన్నపాటి డ్రైనేజ్ పైపు ల ద్వారా మురుగు , వర్షపు నీరు సాఫీగా వెళ్లలేక, బయటకు రావడం వల్ల వీధులన్నీ మురికి కుపంగా మారింది. ఖాళీగా ఉన్న ప్లాట్‌లు చెత్తా చెదారంతో నిండి ఉన్న కారణంగా వర్షం వలన తడిసి ముద్దగా మారి కంపు వాసన కొగుతుందన్నారు.మున్సిపల్ అధికారులకు ఆస్తి పన్ను వసూలు మీద ఉన్న శ్రద్ధ ప్రజా అవసరాలు పరిష్కరించ డంలో శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, నాయకులు గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఏర్పుల శ్రీకాంత్, సంఘం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, చెరుకూరి బాలాజీ, రాజేంద్రప్రసాద్, కందాడ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక

శంషాబాద్ రూరల్, మే 26 : నేడు శంషాబాద్ మున్సిపల్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్,మైనారీ లబ్ధిదారులకు మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక జరుగనున్నట్లు పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ వారికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు వారికి సంబంధించిన దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు ఖాతా,పాన్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకొని సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

రోడ్ల నిర్మాణాలు చేపట్టండి

కమిషనర్ శరత్‌చంద్రకు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అందజేసిన ఆర్డర్ కాఫీని అందజేస్తున్న ఏసీఎఫ్ ప్రతినిధులు

బండ్లగూడ,మే 26: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ జారీ చేసిన పత్రాన్ని కమిషనర్ శరత్‌చంద్రను సోమవారం ఆల్ కాలనీ ఫెడరేషన్ సభ్యులు వినయ్‌రెడ్డి,నరేందర్‌లు కలిసి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస నగర్ కాలనీలో రోడ్లు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఏసీఎఫ్ సభ్యులను కలిసి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

శాతంరాయి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, తదితరులు

శంషాబాద్ ఎంఈవో లక్ష్మణ్ నాయక్

శంషాబాద్ రూరల్, మే 26 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజలందరూ సహకరించాలని శంషాబాద్ ఎంఈవో లక్ష్మణ్ నాయక్ సూచించారు. సోమవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాతంరాయి ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంఈవో లక్ష్మణ్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజలందరూరు సహకరించాలని కోరారు. శాతంరాయిలోని ప్రభుత్వ పాఠశాలకు విద్యాశాఖ ముఖ కార్యదర్శి యోగితారాణా ప్రత్యేక చొరవతీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అందుకోసం విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని సూచించారు.సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య,ఉపాధ్యాయు లు కృష్ణయ్య,నర్సింహరావు,పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు.. ఎంతో మేలు

రైతు ముంగిట్ల శాస్త్రవేత్తలు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు

వ్యవసాయ యూనివర్సిటీ, మే 26: ఉద్యాన పంటలతో రైతులకు ఎంతో మేలు అని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. సోమవారం జాతీయ సేవా పథకంలో భాగంగా మొయినాబాద్ మండల పరిధిలో ఆమదాపూర్ , కసింబౌలి శంషాబాద్ మండలంలోని గొల్లపల్లి, చిన్న గోల్కొండ, గ్రామాలలో పలువురు రైతులను కలిశారు. ఈ సందర్భంగా గ్రామ స్పెషల్ ఆఫీసర్స్, ఉద్యాన కళాశాల ఓ.ఎస్.ఏ డాక్టర్ కళాధర్ బాబు మాట్లాడుతూ,రైతులకు పంట మార్పిడి, విలువ ఆధారిత ఉత్పత్తులు , సమగ్ర సస్యరక్షణ గురించి అవగాహన కల్పించాలని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు చదువుతోపాటు విద్యార్థి దశలోనే సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ఇన్‌చార్జ్ రజిత, రామకృష్ణ స్టూడెంట్ వాలంటీర్లు ప్రశాంత్,దినేష్ , జగదీష్, సాత్విక , స్వప్న, నవ్య పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు

వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సుకృత్‌కుమార్

రామంజాపూర్ గ్రామంలో రైతుల అవగాహన పత్రాలను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సుకృత్‌కుమార్, తదితరులు

శంషాబాద్ రూరల్, మే 26 : సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం అఖిల భారత సూక్ష్మపోషకాల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సుకృత్‌కుమార్ తెలిపారు. సోమవారం శంషాబాద్ మండలంలోని రామంజాపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సుకృత్‌కుమార్ హాజరై మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు సాధించాలని వివరించారు. భూసార పరీక్షలు నిర్వహించుకొని అందుకనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. రసాయన ఎరువులు వాడకంతో నేలలో పోషకాలు లభ్యత పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉండడంతో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. యూరియా అధిక మోతాదులో వాడటంతో చీడపీడల సమస్య ఏర్పడటమే కాకుండా పెట్టుబడి ఖర్చు పెరుగుతుందని వివరించారు. నేల నాణ్యత తగ్గకుండా అధికారులు ఇస్తున్న సూచనలు, సలహాలు పాటించాలన్నారు. పంట మార్పిడితోనే మంచి దిగుబడులు వస్తాయన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శ్వేత, విస్తరణ అధికారి సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై పాలకులు దృష్టిపెట్టాలి

అఖిల భారత బంజారా సేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడు టీసీ రాథోడ్

సమావేశంలో మాట్లాడుతున్న టీసీ రాథోడ్

ఖైరతాబాద్, మే 26 : బంజారాల హక్కుల సాధనే లక్ష్యంగా అఖిల భారత బంజారా సేవా సంఘ్ ముందుకు సాగుతుందని ఆ సంఘం నూతన జాతీయ అధ్యక్షుడు టీసీ రాథోడ్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న బంజారా యువతను చైతన్యవంతులను చేసి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారు రాణించేలా కృషి చేస్తానన్నారు. బంజారాల సమస్యల పరిష్కారానికి పాలక ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మాజీ మంత్రి అమర్‌సింగ్ ధిలావత్ మాట్లాడుతూ అఖిల భారత బంజారా సేవా సంఘ్‌కు జరిగిన ఎన్నికల్లో టీసీ రాథోడ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందారన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు రవీందర్ నాయక్, మోహన్ నాయక్, సూరజ్ పాల్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి ఇంట్లో చోరీ

మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

వెంగళరావునగర్, మే 26 : ఓ వైద్యురాలి ఇంట్లో చోరీ అయిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం .. మధురానగర్ కాలనీలో నివాసం ఉండే డాక్టర్ ప్రతిభ తన ఇంటికి తాళం వేసి హఫీజ్‌పేట్‌కు వెళ్లారు. ఇంటికి ఉన్న తాళాలు పగులగొట్టి ఉన్నాయని స్థానికులు ఆమెకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆమె ఇంటికి చేరుకుని వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని సామగ్రి అంతా చిందరవందరగా పడి ఉన్నాయి.తన సేవలకు గుర్తించి 1984లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన వెండి కప్పును కూడా దొంగలు అపహరించుకెళ్లారు.. బాధితురాలి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంట మార్పిడితో.. అధిక లాభాలు

శామీర్‌పేట, మే 26: పంట మార్పిడితో అనేక లాభాలు ఉన్నాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనురాధ, డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలను ఆర్రాస్‌పల్లి, కేశ్వపూర్ గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవసరం మేరకే రసాయన ఎరువులు ఉపయోగించాలన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

చిక్కడపల్లి, మే 26: అభివృద్ధి పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో పలు పార్కుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సోమవారం జీహెచ్ ఎంసీ ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌తో కలిసి ఆమె పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ.. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పార్కుల అభివృద్ధి కో సం తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు.

ఎమ్మెల్యే మాగంటితోనే అభివృద్ధి

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో కార్పొరేటర్లు రాజ్ కుమార్, దేదీప్య



చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు రాజ్ కుమార్, దేదీప్య రావు తదితరులు

జూబ్లీహిల్స్, మే 26: జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తోనే సాధ్యమవుతుందని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్ డివిజన్ల కార్పొరేటర్లు రాజ్ కుమార్ పటేల్, దేదీప్య రావు పేర్కొన్నారు. సోమవారం ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు కేసీఆర్ అందించిన లక్ష నూట పదహారు నగదు తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ సందర్భంగా యూసుఫ్ గూడ డివిజన్‌కు చెందిన 21 మంది లబ్ధిదారులకు కలిపి మొత్తం రూ. 20 లక్షల 2 వేల 436 చెక్కులను ఖైరతాబాద్ తహసీల్దార్ ఎండీ. నయీముద్దీన్ తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూసుఫ్‌గూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ దాస్, నాయకులు విజయ్ ముదిరాజ్, అమ్మాజీ, నాగ, బాలు, బాల రాజ్ పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్ పరిధిలో..

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదల పాలిట వరమని రహ్మత్ నగర్ కార్పొరేటర్ సీ ఎన్ రెడ్డి పేర్కొన్నారు. ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో సుమారు 100 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ ఎం డి. నయీముద్దీన్‌తో కలిసి చెక్కులు పంపిణీ చేశారు.

మణికొండలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

మణికొండ, మే 26 : మణికొండ మున్సిపాలిటీలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేతలు చేపట్టారు. కొన్నేండ్లుగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్షిప్, పంచవటి కాలనీ, గో గ్రీన్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నెక్నాంపూర్ పుప్పాలగూడ తదితర ప్రాంతాల్లో నిబంధనలు అతిక్రమించి పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. కాగా ఇటీవల స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు గోగ్రీన్ కాలనీలో వెలిసిన అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు. పంచవటి కాలనీలోని రామారావు అనే బిల్డర్‌కు చెందిన ఓ నిర్మాణం సెల్లారు తో కలిసి 4 అంతస్తులకు అనుమతి పొంది... అదనంగా రెండు అంతస్తుల నిర్మాణం చేపట్టడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు మున్సిపల్ సిబ్బందితో కలిసి కూల్చివేతలను చేపట్టారు. అదనంగా వెలిసిన రెండో అంతస్తులోని శ్లాబ్‌లను తొలగించి సదరు బిల్డర్ పై పోలీసు కేసు నమోదు చేస్తామని టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ తెలిపారు. త్వరలోనే పోలీసు బందోబస్తు తో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారి పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎప్పుడు ఇస్తారు..

చిక్కడపల్లి, మే 26: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇందిర మ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఎప్పుడు అ మలు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్ర శ్నించింది. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది . ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక పథకం అమలుకు నోచుకోలేదని విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని మండిపడ్డారు. జిల్లా వ్యా ప్తంగా ఉపాధి కూలీల సమస్యలపై జూన్ 5న జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనకయ్య,వినోద, నిమ్మల వెం కన్న, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, సహాయ కార్యదర్శులు రాంబాబు, గడ్డం స్వామి, ఆలే టి కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు చంటి, రివూ జ, నాగరత్నమ్మ, సుగుణ, వేణు , ఈసం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, మే 26:బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కొత్తగా నియామకమైన సర్వేయర్లకు అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కొత్తగా నియమితులైన 146మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల సర్టిఫికెట్ల పరిశీలన, శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేయర్ల శిక్షణ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ప్రతిఒక్కరూ శిక్షణకు విధిగా హాజరుకావాలన్నారు. 52 రోజుల పాటు శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ పొందిన తరువాత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శామీర్‌పేట్ తహశీల్దార్ యాదగిరిరెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, అధికారులు బలరాం, సత్తమ్మ, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో మౌలిక వసతులు కల్పించాలి

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై ఉప కమిషనర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 26: శ్మశానవాటికల్లో కనీస వసతులు లేక ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పద్మశాలిపురంలోని శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని ఉపకమిషనర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ప్రతి రోజూ పర్యటిస్తున్నామన్నారు. ఇందులో ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకోని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాము, అక్కం రాఘవేందర్‌యాదవ్, రాజేష్‌యాదవ్, ఎడ్లకాడి సూర్యం, ఎస్.అశోక్ కుమార్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

శివరాంపల్లి రైల్వేస్టేషన్ దారిని తెరిపించాలి...

ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న రోడ్డు మధ్యలో రైల్వే అధికారులు ప్రహరీ గోడను ఏర్పాటు చేయడం వల్ల పలు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నో ఏండ్లుగా శివరాంపల్లి, బాబుల్‌రెడ్డినగర్, మోహన్‌రెడ్డినగర్, వడ్డెర బస్తీ, సాయిబాబానగర్, ప్రగతి కాలనీ, కాటేదాన్ పారిశ్రామికవాడ ప్రజలు ఈ దారినే ఉపయోగిస్తుంటారన్నారు. ఈ దారిని మూసివేయడంతో స్థానికులు ఆసుపత్రులకు , పాఠశాలలకు వెళ్లాలన్నా 5–6 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందన్నారు.

బస్సు వైపర్లు పనిచేయకపోవడంతో పంజాగుట్ట వద్ద బస్సును ఆపి అద్దాన్ని తూడుస్తున్న డ్రైవర్

తడవకుండా తెలుగుతల్లి ఫ్లై ఓవర్ కింద పాదచారులు, వాహనదారులు

వర్షంతో..స్తంభించిన ట్రాఫిక్

రోడ్లన్నీ జలమయం...

ఇబ్బందులు పడ్డ వాహనదారులు

ఖైరతాబాద్‌లో కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షానికి తడవకుండా ఉండేందుకు వాహనదారులు, పాదచారులు ఫ్లై ఓవర్ల కిందకు పరుగులు తీశారు. – ఖైరతాబాద్, మే 26 :

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, మే 26 : శంషాబాద్ ఫ్లైఓవర్ కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ పట్టణంలోని హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద ఓ వ్యక్తిపడి ఉన్నట్లు సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నెల రోజుల నుంచి ఫ్లైఓవర్ కిందనే నివాసముంటూ యాచకుడిగా ఉన్నట్లు గుర్తించారు.

అతడి వయస్సు 60 నుంచి 65 ఏండ్లు ఉంటాయని వివరించారు. ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు స మాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రుణం ఇప్పిస్తామని వచ్చి..

వెంగళరావునగర్, మే 26 :బ్యాంకులో రుణం ఇప్పిస్తామని చెప్పి ఓ మహిళ వద్ద రూ.50 వేలు తీసుకుని ఉడాయించారు. ఎస్.ఆర్.నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట పోలీసులైన్, గన్ బజార్‌కు చెందిన థెరిస్సా డిక్రూజ్‌కు (46) రూ.50 లక్షల రుణం అవసరం ఉండడంతో రుణం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసింది. జడ్డా రెడ్డి అనే వ్యక్తి పరిచయమై కావాల్సిన రుణం ఇప్పిస్తానని చెప్పాడు. రుణం పొందాలంటే కొన్ని పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి దాస్ అనే వ్యక్తితో కలిసి ఆదివారం మహిళ ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న పత్రాలతో పాటు ఆమెను వెంట తీసుకుని అమీర్పేటకు వచ్చారు. హరి దోశ హోటల్ వద్ద కూర్చుని మహిళ వద్ద ఉన్న పత్రాలు తీసుకుని, ప్రాసెసింగ్ కోసం రూ.50 వేలు కావాలని అడగడంతో డబ్బులు ఇచ్చింది. తర్వాత ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు ఎస్.ఆర్.నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం నిల్వలపై ఆరా..

గోదాంలో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న డీఎస్ఓ రమేశ్

ముషీరాబాద్, మే 26: అజామాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ సర్కిల్ -6 గోదాములను డీఎస్ఓ రమేశ్ సోమవారం సందర్శించారు. మూడు నెలలు రేషన్ బియ్యం ఒకే నెలలో ఇవ్వనుండడంతో బియ్యం నిల్వలపై ఆరా తీశారు. సర్కిల్-4, సర్కిల్ -6 పరిధిలోని రేషన్ షాపులకు సంబంధించి బియ్యం పంపిణీ ఇక్కడి నుంచే జరగనుండడంతో గోదామును పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలకు సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయా, ఇంకా అవసరం పడతాయా.. అని వాకబ్ చేశారు. ఒకటో తారీకు నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలింపు, పంపిణీ ఏర్పాట్లపై తగిన సూచనలు చేశారు. ఒకే నెలలో మూ డు నెలలకు సరిపడా రేషన్ బియ్యం మూ డు దఫాలుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పౌరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్తగా రేషన్‌కార్డు పొందినవారు సైతం రేషన్ బియ్యం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఓ దీప్తి, గోదాం ఇన్‌చార్జి కిరణ్ పాల్గొన్నారు.